ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

ముఖ్యాంశాలు

- భారత్ సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తూ, వికసిత్ భారత్ దిశగా పురోగమిస్తోందని కేంద్ర పశు సంవర్ధక శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్ అన్నారు.

- ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా గిరిజనులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందిస్తున్నామని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.

- రైతుల ఆదాయం పెరుగుదలే లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ పని చేస్తుందని నూతన కమీషనర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు.

- ఈ నెల 19వ తేదీ నాటికి పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం 2047 సంవత్సరం నాటికి వికసిత్ భారత్ గా ఆవిర్భవిస్తుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈరోజు ఆయన తిరుపతిలో జరిగిన కురబ కులస్తుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... భారత్ సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు వేగవంతమైన, అద్భుతమైన పరిపాలనను అందిస్తున్నారని చెప్పారు. ప్రధాని సుపరిపాలనలో దేశ ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొంటూ...

(వాయిస్ 18 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా గిరిజనులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందిస్తున్నామని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఏకలవ్య జయంతి సందర్భంగా ఈరోజు ఆయన పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ... కులవృత్తులు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గిరిజన చిన్నారుల విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు. కాగా... రాష్ట్ర ఆశా వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో పలువురు ఆశా వర్కర్లు మంత్రిని కలిసి తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కోవిడ్ సమయంలో ఆశా వర్కర్లు అందించిన సేవలు శ్లాఘనీయమని వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రైతుల ఆదాయం పెరుగుదల లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ నూతన కమీషనర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. ఈరోజు మంగళగిరి ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు అవసరమైన కార్యాచరణను అమలు చేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ కృషి చేస్తుందని చెప్పారు. క్రిమిసంహారక మందుల వినియోగంలో రైతులను చైతన్య పరిచేలా క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ ఇస్తామని కమీషనర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 19వ తేదీ నాటికి పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో రుతుపవన ద్రోణి విస్తరించి ఉందని పేర్కొంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలోని పలు చోట్ల రానున్న రెండు రోజుల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఒకటి రెండు చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురవచ్చని పేర్కొన్నారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉందని, బలమైన గాలులు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్గరీ మదనపల్లె, తిరుపతి పర్యటనలో భాగంగా ఈరోజు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర రహదారులు, భవనాలు శాఖ మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి కాంతి లాల్ దండే, తిరుపతి పార్లమెంట్ సభ్యుడు మద్దిల గురుమూర్తి విమానాశ్రయంలో కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి విమానాశ్రయం విఐపీ లాంజ్ లో రాష్ట్రంలోని జాతీయ రహదారులు, హై వే ప్రాజెక్టులపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మదనపల్లెకు హెలీకాప్టర్‌లో ప్రయాణమయ్యారు. కేంద్ర మంత్రి ఈ రాత్రి తిరుమల చేరుకుని రేపు ఉదయం వేంకటేశ్వర స్వామి ని దర్శించుకోనున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

బీసీ సంక్షేమం, జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. సవిత మంగళగిరిలో ఈరోజు ప్రజాదర్బారును నిర్వహించారు. అర్జీదారుల నుండి వినతులను స్వయంగా స్వీకరించి, త్వరిత గతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంపద సృష్టించి రాష్ట్రాన్ని ఒక గాడిలో పెట్టగలరని ప్రజలు విశ్వసించారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించి వారి మన్ననలు పొందాలని ముఖ్యమంత్రి సూచించారని ఆమె తెలిపారు. అనంతపురం జిల్లా నుండి భూ సమస్యలపై పలు ఫిర్యాదులు వచ్చాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆషాఢ ఏకాదశి పండుగను దేశ ప్రజలు ఈరోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆషాఢ ఏకాదశి సందర్భంగా ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. భక్తి, కరుణ, నిరుపేదలకు సేవ చేయాలనే స్ఫూర్తిని ఈ పండుగ కలిగిస్తుందని ప్రధాని తమ సందేశంలో పేర్కొన్నారు. కాగా... నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తున్న భక్తులందరికీ ఆ భగవంతుడు ఆనందం , ఆరోగ్యం, ఐశ్వర్యాలను ప్రసాదించాలని ముఖ్యమంత్రి నారా

చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. ఆషాఢ ఏకాదశి సందర్భంగా విడుదల చేసిన సందేశంలో ఆయన ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

======================

నెల్లూరులో రొట్టెల పండుగ సంప్రదాయ బద్ధంగా ఈ రోజు మొదలైంది. మొహారం సందర్భంగా ప్రతి ఏటా నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద ఐదు రోజులపాటు జరిగే ఈ పండుగకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బారా షహీద్ దర్గా ను దర్శించుకున్న తర్వాత భక్తులు తమ కోరికలు నెరవేరాలని స్వర్ణాల చెరువు వద్ద రొట్టెల పండుగను చేసుకుంటారు. కాగా...ఈ పండుగ నిర్వహణ కోసం జిల్లా అధికార యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేసింది.

======================

బాపట్ల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా తుషార్ డూడీ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, శాంతి భద్రతల అంశంపై చర్చించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందిస్తూ... ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించేందుకు త్వరలో హెల్ప్‌లైన్ నెంబరును ప్రారంభిస్తామని ఎస్పీ ఈ సందర్భంగా వెల్లడించారు.

======================

అన్ని ప్రభుత్వ శాఖలను ప్రక్షాళన చేయవలసి ఉందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈరోజు ఆయన తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో వివిధ శాఖల్లో జరిగిన అవకతవకలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నామన్నారు. ఎక్సైజ్ విధానంపై విస్తృత స్థాయి అధ్యయనం జరుగుతోందని, అస్తవ్యస్తమైన ఎక్సైజ్ పాలసీని గాడిన పెడుతున్నామని మంత్రి ఈ సందర్భంగా వివరించారు.

======================

ఆధార్ కార్డులో వివరాల సవరణలకు మరొక అవకాశం కల్పిస్తున్నట్టు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సి. నాగరాణి చెప్పారు. భీమవరంలో ఆమె అధికారులతో మాట్లాడుతూ... ఈ నెల 23 నుండి ఐదు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ఆధార్ సేవలు అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని యానాది, ఎరుకల కుటుంబాలను గుర్తించి, ఆధార్ లేని వారి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించాలని మండల తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

======================

న్యాయ సేవలు అందరికి అందుబాటులో వచ్చేలా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కృషి చేయాలని కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ దుర్గాప్రసాద్ రావు కోరారు. తుళ్ళూరు మండలం మల్కాపురం గ్రామంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యాకలాపాలను ఈ రోజు ఆయన ప్రారంభించారు.

======================
======================